కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :185 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శుక్రవారం 13-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

పునరావాసం కల్పించాకే ఇళ్లు ఖాళీ చేస్తాం!



ఆదిలాబాద్, ఆదిలాబాద్ పట్టణంలోని నిజాం కాలం నాటి చెరువు సుందరీకరణ పనులు స్థానికుల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి.చెరువు పరిసరాల్లోని ఖానాపూర్, కొలిపుర కాలనీలకు చెందిన ఇళ్లను ఖాళీ చేయాలంటూ అధికారులు నోటీసులు జారీ చేయడంతో బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సుమారు 122 ఇళ్ల యజమానులకు నోటీసులు అందినట్లు సమాచారం.దశాబ్దాలుగా అక్కడే నివాసం ఉంటున్న తమకు ముందుగా పట్టణ శివారులో ఇంటి స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. పునరావాసం కల్పించిన తర్వాతే ఇళ్లు ఖాళీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

బాధితులకు కాంగ్రెస్ నేతల భరోసా..

గురువారం డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, కాంగ్రెస్ నాయకులు సాజిద్ ఖాన్, గంద్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డి తదితరులు కాలనీలను సందర్శించి బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు అన్యాయం జరగకుండా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని నరేష్ జాదవ్ హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ నేతలు అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌ను కలిసి నిర్వాసితుల సమస్యలను వివరించారు. జిల్లా కలెక్టర్‌తో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఆటో డ్రైవర్లు,క్యాబ్ డ్రైవర్ల పొట్ట కొట్టాలని చూస్తున్న కంపెనీ

హైదరాబాద్, ఒక కంపెనీ తన అడ్వర్టైజింగ్ కోసం ఆటో డ్రైవర్ల, క్యాబ్ డ్రైవర్ల పొట్ట కొట్టాలని చూస్తుందని.. జియో లాగా గ్రీన్ నావీ అనే కంపెనీ చేయబోతోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. 2016లో జియో అనే కంపెనీ ఫ్రీ డేటా, ఫ్రీ కాల్స్ అనే ఆఫర్‌తో ప్రజల ముందుకొచ్చింది.. ఫ్రీ ఆఫర్‌తో జియో కమ్యూనికేషన్స్ రాగానే నాలుగు కంపెనీలు ఖతమైపోయినయ్. ఎయిర్‌సెల్, టాటా డొకోమో, రిలయన్స్ టెలికమ్యూనికేషన్స్, ఇక వొడాఫోన్, ఐడియా.. రెండూ కలిసిపోయాయని అన్నారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఫ్రీ డాటా వచ్చాక లక్షల మంది కష్టమర్లు వచ్చిన తర్వాత జియోవాళ్లు మెల్లమెల్లగా రేట్లు పెంచడం మొదలుపెట్టారు. ఎందుకంటే మిగితా పోటీదారులంతా చచ్చిపోయిర్రు.. ఇంకేముంటరు.. ఇక మిగిలింది జియో, ఎయిర్‌టెల్.. కొంతవరకు ఐడియా, ఇక బీఎస్ ఎన్ ఎల్‌ను ఎప్పుడో ఖతం చేసిర్రు. ఇక మిగిలింది రెండుమూడు కంపెనీలే.. ఇప్పుడు గ్రీన్ SM అనే కంపెనీ కూడా అదే చేయబోతుందన్నారు.కిలోమీటర్‌కు రూ.8 అని కష్టమర్లను



ఆకర్షించి ఆటోడ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లంతా మీ ఆటోలు, క్యాబ్‌లు బంద్ చేసుకోండి..మీ ర్యాపిడోలు, ఇంకేవో కాదు.. మీరు నా దగ్గరకొచ్చి డ్రైవర్లుగా చేరండి.. అని గ్రీన్ SM పరోక్షంగా మెసేజ్ చేస్తుంటే ప్రభుత్వ చోద్యం చూస్తున్నదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్ అయ్యారు. మొట్టమొదట వీళ్లంతా అవన్నీ వదిలేసి వాళ్లకు ఏ ఉద్యోగం రాదు..

పగలు ఎండ, రాత్రి చలి.. ఆస్పత్రులకు క్యూ కట్టిన తెలంగాణ ప్రజలు



హైదరాబాద్, రాష్ట్రంలో కొద్ది రోజులుగా వాతావరణం వింతగా మారుతోంది. పగటి వేళల్లో భానుడు ప్రతాపం చూపుతుండగా, సాయంత్రం కాగానే చలి గాలులు వణికిస్తున్నాయి. ఇలా రోజులో రెండు భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొనడం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నపిల్లలు, వృద్ధులు ఈ మార్పులకు త్వరగా అనారోగ్యం బారిన పడుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు చలి తీవ్రత వల్ల గుండెపోటు, పక్షవాతం బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

వాతావరణంలో మార్పుల వల్ల గాలిలో వైరస్‌లు, బ్యాక్టీరియా వ్యాప్తి పెరుగుతుంది. దీనివల్ల న్యుమోనియా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తీవ్రమైన జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నీరసం, పిల్లల్లో అయితే పక్కటెముకలు ఎగరడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. పొగతాగే అలవాటు, మద్యపానం ఉన్నవారితో పాటు షుగర్, టీబీ వ్యాధిగ్రస్తులకు న్యుమోనియా త్వరగా సోకుతుంది. మరోవైపు, చలి గాలుల వల్ల చర్మం తేమను కోల్పోయి పొడిబారడం, దురద, దద్దుర్లు, పెదాలు పగలడం వంటి సమస్యలు వస్తాయి. వీటి నుంచి ఉపశమనం పొందడానికి కొబ్బరి నూనె రాయడం లేదా చర్మ వైద్యుల సలహాతో మాయిశ్చరైజర్లు వాడటం మంచిది.

సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య సూచనలు:

వృద్ధులు ఉండే గదుల్లోకి చలిగాలి రాకుండా కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. బయటకు వెళ్లేటప్పుడు చెవులు, మెడ, చేతులకు రక్షణగా ఉన్ని దుస్తులు ధరించాలి. రక్తపోటు, మధుమేహం, ఆస్తమా ఉన్నవారు క్రమం తప్పకుండా మందులు వాడుతూ చలికి దూరంగా ఉండాలి. మద్యం, కూల్ డ్రింక్స్ పూర్తిగా మానేసి గోరువెచ్చని నీరు, తాజా పండ్ల రసాలు తీసుకోవాలి. రోజూ కాసేపు నడవడం, తేలికపాటి వ్యాయామాలు చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగవుతుంది. కీళ్ల నొప్పులు రాకుండా ఆహారంలో జిగురు పదార్థాలను చేర్చుకోవాలి.

పిల్లల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

ఈ వాతావరణం కారణంగా 15 ఏళ్ల లోపు పిల్లలకు జలుబు, దగ్గు త్వరగా వస్తాయి. కాబట్టి స్వెటర్లు, మంకీ క్యాప్‌లు తప్పనిసరిగా వేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో నిమ్మరసం, తేనె కలిపి తాగించడం మంచిది. గొంతు గరగరగా ఉంటే గోరువెచ్చని ఉప్పునీటితో పుక్కిలించాలి. విటమిన్-సి ఉండే ఉసిరి, నిమ్మకాయలతో పాటు ప్రొటీన్ ఫుడ్ ఇవ్వాలి. ఎప్పటికప్పుడు తాజాగా వండిన వేడి ఆహారాన్ని మాత్రమే తినిపించాలి. జీర్ణక్రియ సాఫీగా ఉండేందుకు రాగి జావ, బార్లీ నీరు తాగించాలి. వారానికి రెండుసార్లు మిరియాలు, టమాటా రసంతో పాటు ఆకుకూరలు పెట్టాలి. గుడ్లు, పెరుగు, క్యారెట్, బంగాళదుంప, దోసకాయ, ఎండుద్రాక్ష, పచ్చి బఠానీలు వంటివి ఆహారంలో భాగం చేయాలి. ఐస్ క్రీమ్‌లు, కూల్ డ్రింక్స్, మసాలా వంటకాలు, జంక్ ఫుడ్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి.

హైదరాబాద్ నగరంలో మరో దారుణ హత్య

హైదరాబాద్:నగరంలో మరో మర్డర్ కేసు నమోదయింది. దుండగులు మహిళ నోట్లో గుడ్డలు కుక్కి, కాళ్లు కట్టేసి హతమార్చారు.మీర్‌పేట్ పరిధిలోని జిల్లెలగూడ దత్తునగర్‌లోని శ్రీలక్ష్మి రెసిడెన్సీలో నివాసం ఉంటున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అరుణ్ కుమార్ భార్య అనిత (35)ను దండగులు దారుణంగా హతమార్చారు. నోట్లో గుడ్డలు కుక్కి, కాళ్లు కట్టేసి హతమార్చినట్టు పారిపోయారు. రక్తపు మడుగులో ఉన్న తల్లిని చూసిన పిల్లలు తండ్రి అరుణ్ కుమార్ కి సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం.. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా నిలిచాం!



హైదరాబాద్:నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ ఆత్మహత్య చేసుకున్న స్వర్గీయ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు..ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రభుత్వం, ఆర్టీసీ తరపున కుటుంబానికి పరిహారం అందించాం. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందించి దాదాపు రూ.కోటి ఆర్థిక సహాయం చేసి కుటుంబానికి అండగా నిలిచారు. ఇచ్చిన హామీ మేరకు శంకర్ గౌడ్ కుమారుడు హేమంత్ గౌడ్‌కు ఆర్టీసీలో రికార్డ్ ట్రెజరర్‌గా ఉద్యోగ నియామక పత్రాన్ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో కలిసి అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం మా ప్రభుత్వ బాధ్యత.ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత. ఉద్యోగులను కాపాడుకోవడం సమాజం బాధ్యత.ఆర్టీసీ ఉద్యోగులు దురుసుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి. భౌతిక దాడులకు పాల్పడకూడదు.ఉద్యోగులపై దాడులు చేస్తే ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తుంది. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.ప్రయాణికులు మర్చిపోయిన విలువైన వస్తువులను నిజాయితీగా తిరిగి అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు ఎందరో ఉన్నారు. వారి సేవలను గుర్తించాలని అన్నారు..మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నాం.ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నాం.ఏ గ్రామానికైనా బస్సు సౌకర్యం అవసరమైతే స్థానిక ఆర్టీసీ అధికారులను సంప్రదించాలి. రూట్ వెరిఫికేషన్, సాధ్యాసాధ్యాల పరిశీలన అనంతరం బస్సు సౌకర్యం కల్పిస్తాం.బాధిత కుటుంబానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం మా బాధ్యత. ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు

ప్రెస్ రిలీజ్‌ల కాలం పోయింది.. ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్..!



న్యూఢిల్లీ,మీడియాతో తనకు సుదీర్ఘ కాలంగా అనుబంధం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మీడియా ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ లేదని ఆయన చెప్పారు. విపత్తులు, సంక్షోభాల సమయంలో క్షేత్రస్థాయి రిపోర్టర్‌లు కథనాల కోసం ఎంతదూరమైనా వెళ్తారని ప్రశంసించారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయం లో జర్నలిస్టుల కోసం దీపావళి మిలన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు.విలేకరులతో తనకు సుదీర్ఘకాల అనుబంధం ఉన్నదని, బీజేపీలో చేరిన తొలినాళ్లలో మీడియా ఈవెంట్ల కోసం కుర్చీలువేసే బాధ్యత తనదే ఉండేదని, అప్పట్లో తాను విలేకరులతో చాలా విషయాలు మాట్లాడేవాడినని ప్రధాని తెలిపారు. గడిచిన కొన్నేళ్లలో జర్నలిజంలో ఎన్నో మార్పులు వచ్చాయని, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి జరిగిందని అన్నారు. ఒకప్పుడు మీడియా సమావేశాల ప్రసారం కోసం అవుట్‌సైడ్ బ్రాడ్‌కాస్ట్ వ్యాన్లను ఉపయోగించేవారని, ఇప్పుడు మొబైల్ ఫోనే బ్రాడ్‌కాస్ట్ వాహనంగా మారిపోయిందని చెప్పారు.గతంలో ఏదైనా కార్యక్రమం జరిగితే పత్రికా ప్రకటనలు ఇచ్చేవారని, ఇప్పుడు సామాజిక మాధ్యమాల విస్తృతితో అన్నీ ఇన్‌స్టా రీల్స్‌లోనే తెలిసిపోతున్నాయని మోదీ అన్నారు. ఈ సందర్భంగా దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రధాని వివరించారు. పేదరిక నిర్మూలన కోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఒకప్పుడు గరీబీ హఠావో వంటి నినాదాలు వినిపించేవని, కానీ తమ ప్రభుత్వం గత 12 ఏళ్లలో 50 కోట్ల మందిని దారిద్ర్య రేఖ నుంచి బయటపడేసిందని చెప్పారు. దేశంలో అసాధారణ విజయాలు సాధించినవారు ఎంతోమంది ఉన్నారని, వారి విజయ గాథలను ప్రపంచానికి తెలియజేయాలని విలేకరులను కోరారు.

22ఎ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్లు, రిజిస్ట్రార్లకు మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు



హైదరాబాద్, ఏండ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేసి దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 22-ఎ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో అమలు పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 22-ఎ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా జీవో 118, జీవో 76లకు సంబంధించి మెమోలు, 22-ఎ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు, యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జీవో 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అంశాలకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు.

కలెక్టర్లదే బాధ్యత

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని పేర్కొన్నారు. ప్రతి వారం జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, ఇతర సంబంధిత అధికారులు సమావేశమై 22-ఎ సమస్యల పరిష్కారంపై సమీక్షించుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని అంశాలను రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్‌కుమార్ నాయకత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, జారీ చేస్తున్న జీవోలు, మెమోలు కేవలం ప్రభుత్వ ఉత్తర్వులకే పరిమితం కాకూడదని, వాటి అసలు ఉద్దేశం క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే ప్రజలకు నిజమైన మేలు జరుగుతుందని మంత్రి అన్నారు. ముఖ్యంగా కలెక్టర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి ప్రకారం అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోర్టు అంశాలపై నివేదిక

యూఎల్సీకి సంబంధించి వివిధ కోర్టులు వెలువరించిన తుది తీర్పులు, ప్రభుత్వం తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్లు (ఎస్ఎల్‌పీలు) దాఖలు చేసే అంశాలు, ఎస్ఎల్‌పీలు దాఖలు చేయడానికి అవకాశం లేని ఇతర అంశాలన్నింటిపై వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి కమిటీ సమగ్ర నివేదిక అందించాలని మంత్రి సూచించారు. ఈ నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. 22-ఎ జాబితాలో ఉన్న ప్రతి భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, సంబంధిత ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన తర్వాతే తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిజమైన యజమానులు తమ భూములపై హక్కులు పొందేందుకు అనవసరమైన జాప్యం జరగకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులకు న్యాయం చేసే క్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన భూముల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

పెట్టుబడిదారులకు భారత్ భరోసా

విశాఖపట్నం :ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ నగరం సీఐఐ భాగస్వామ్య సదస్సుకు శాశ్వత వేదికగా మారుతోంది. పవిత్రమైన కార్తీక మాసంలో ఈ పెట్టుబడుల సదస్సు నిర్వహించటం సంతోషదాయకం, ఒక దీపం మరో దీపాన్ని వెలిగిస్తుంది. పెట్టుబడుల సదస్సు కూడా దేశ వాణిజ్యాన్ని వృద్ధి చేస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి పీయూష్ గోయెల్ అన్నారు.విశాఖ లో జరుగుతున్న సిఐఐ సమ్మిట్ లో అయన మాట్లాడారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఇటీవలే రెండు తుఫాన్లు ఏపీ తీరాన్ని తాకాయి. విధ్వంసం సృష్టించాయి. కానీ నష్టం జరిగినా వెంటనే కోలుకుని విశాఖ నగరం పెట్టుబడుల సదస్సుకు వేదిక అయ్యింది.పపంచ వ్యాప్తంగా పారిశ్రామిక వేత్తల్ని, ఆయా దేశాల రాయబారులను, ప్రతినిధుల్ని ఆహ్వానించింది. కాలం కంటే ముందు ఆలోచన చేసి ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీల గురించి మాట్లాడిన వ్యక్తి సీఎం చంద్రబాబు. అంతా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడుకుంటే ఆయన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అమలు చేస్తున్నారు.పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచేలా పారిశ్రామిక ప్రోత్సాహకాలను అందించేందుకు ఎస్క్రోఖాతాను ఏపీ ప్రారంభించింది. 2024లో సీఎం చంద్రబాబు అధికారం చేపట్టినప్పుడు రాష్ట్రానికి పెద్ద ఎత్తున అప్పులు, విధ్వంసమైన వ్యవస్థలు ఆయన చేతికి వచ్చాయి.



సంపాదకీయం

శుక్రవారం 13-11-2026

విశ్వాసం, గౌరవమే వివాహ వ్యవస్థకు మూలం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించి ఉప ముఖ్యమంత్రి అయిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు తన మూడవ భార్యకు విడాకులు ఇచ్చి దూరంగా ఉంటున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పవన్ కళ్యాణ్ విడాకుల గురించే మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియా, టీవీ చానళ్లు, వెబ్ సైట్లు ఒకటేంటి అన్నీ చోట్ల ఏపీ డిప్యూటీ సీఎం ముచ్చటగా మూడో పెళ్లిని కూడా రద్దు చేసుకోవడం ఏంటని ఆశ్చర్యపోతున్నారు. 2026 నవంబర్ 9 రాత్రి పవన్ కళ్యాణ్, అనా లెజ్‌నెవా విడిపోతున్నట్టు ప్రకటించారు. అభిమానులకు ఈ ప్రకటన షాకిచ్చింది. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ కళ్యాణ్ ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన ప్రసంగాల్లో సనాతన ధర్మ పరిరక్షణ గురించి ప్రస్తావిస్తుంటారు. అయితే సనాతన ధర్మం గురించి మాట్లాడే వ్యక్తులు తమ వ్యక్తిగత జీవితంలో ధర్మవిలువలు పాటిస్తున్నారా? పవన్ కళ్యాణ్ ముమూడు పెళ్లిళ్లు.. మూడో భార్యతో విడాకుల వ్యవహారంతో మరోసారి చర్చనీయాంశమైంది. 1997లో నందినిని వివాహం చేసుకున్న పవన్ కళ్యాణ్ 2008లో విడాకులు తీసుకున్నారునటి రేణుదేశాయ్ లో సహజీవనం చేసి 2009లో పెళ్లిచేసుకున్నారు..వీరికి ఇద్దరు పిల్లలు.. 2012లో విడిపోయారు.రష్యాకు చెందిన అనా లెజ్‌నెవాని 2013లో వివాహం చేసుకున్నారు..వీరికి ఇద్దరు పిల్లలున్నారు..లేటెస్ట్ గా పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్టు ప్రకటించారుతమ వైవాహిక బంధం ముగిసినప్పటికీ పిల్లల బాధ్యతలు కలసి నిర్వహిస్తామని తెలిపారు. సనాతన ధర్మం అంటే శాశ్వతమైన ధర్మం లేదా ఎప్పటికీ నిలిచే జీవన విలువలు అని అర్థం. ఇది కేవలం మతపరమైన నినాదం కాదు.. సత్యం, ధర్మం, అహింస, దయ, కరుణ, ఇంద్రియ నిగ్రహం, పరులకు హాని చేయకపోవడం లాంటి విలువలకు సనాతన ధర్మంలో ప్రాధాన్యత ఉంది. ధర్మం అంటే కేవలం పూజ చేయడం, దేవాలయాలు సందర్శించడం, ఆచారాలు పాటించడం మాత్రమే కాదు.. మనిషి తన బాధ్యతలు నిజాయితీగా నిర్వహించడం, ఇతరుల హక్కులు గౌరవించడం, కుటుంబాన్ని బాధ్యతతో నడిపించడం కూడా ధర్మంలో భాగమే. హిందూ సంప్రదాయంలో వివాహాన్ని పవిత్రమైన సంస్కారంగా భావిస్తారు. ప్రాణి భూమ్మీద పడినప్పటి నుంచి మరణించే వరకూ ముఖ్యమైన 16 సంస్కారాలు అనుసరిస్తారు. వాటిలో వివాహం కూడా ఒకటి. అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకుని ఆఖరిక్షణం వరకూ ఆమెతోనే కలసి బతకాలన్నది శాస్త్రవచనం. పవన్ కళ్యాణ్ మొదటి భార్య నందిని. వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. అయితే, పవన్, నందినిల మధ్య ప్రేమ ఎక్కువ కాలం నిలవలేదు. నందిని కూడా విశాఖపట్నంలోని ఒక సంపన్న కుటుంబానికి చెందినది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే రెండో పెళ్లి చేసుకున్నాడని ఆమె ఆరోపించింది. విశాఖపట్నం కుటుంబ న్యాయస్థానానికి వాంగ్మూలం ఇచ్చిన పవన్ కళ్యాణ్, తాను రేణు దేశాయ్‌ను వివాహం చేసుకోలేదని చెప్పారు. ఆ తర్వాత, పవన్ కళ్యాణ్ విడాకుల కోసం దరఖాస్తు చేసుకోగా, 2008లో నందినికి రూ. 5 కోట్ల భరణం చెల్లించి విడాకులు పొందారు.తన మొదటి భార్యతో విడిపోయి, 2012లో, ఈ జంట విడాకులు తీసుకుని విడిపోయారు.అయితే పవన్ కళ్యాణ్ నుండి రేణు దేశాయ్ కోట్ల రూపాయల భరణం అందుకోలేదని సమాచారం. దానికి బదులుగా, పవన్ కళ్యాణ్ ప్రతి నెలా వారి ఇద్దరు పిల్లల పోషణ ఖర్చులను చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. రేణు దేశాయ్ తన పేరు మీద కొన్ని ఆస్తులను రిజిస్టర్ చేయించుకున్నట్లు కూడా సినీ వర్గాల్లో ఇన్ సైడ్ టాక్.తన రెండవ భార్య రేణు దేశాయ్‌తో విడాకులు తీసుకునే ముందు, పవన్ కళ్యాణ్ 2010లో 'టీన్ మార్' సినిమా షూటింగ్ కోసం రష్యా వెళ్లారు. అక్కడ ఆయన మోడల్ అన్నా లెజ్నోవాను కలిశారు. 2012లో రేణు దేశాయ్‌కు విడాకులు ఇచ్చిన పవన్ కళ్యాణ్, 2013 ప్రత్యేక వివాహ చట్టం కింద అన్నా లేజనోవాను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆయన మూడవ వివాహం కూడా విడాకుల బాట పట్టింది. అన్నాతో పవన్ కళ్యాణ్ 13 ఏళ్ల వైవాహిక జీవితానికి తెరదించారు.కొందరు మాత్రం పవన్ కళ్యాణ్ విడాకులు తీసుకోవడానికి ఓ బలైమన కారణం ఉందంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. అందులో మరీ ముఖ్యంగా తన రాజకీయపాలన కోసమే ఈ పని చేసినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సేవ చేయాలన్న ఒకే ఒక్క కారణంతో తన కుటుంబానికి దూరంగా ఉండాలనుకున్నాడని.. అందుకోసమే విడాకులు తీసుకున్నాడని పెద్ద ఎత్తున పోస్ట్‌లు పెడుతున్నారు. నిజంగానే ఈ కారణంతోనే విడాకులు తీసుకున్నాడా? లేదంటే ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయా? అనేది క్లారిటీ లేదు.ఇందులో నిజమెంతుందో పక్కన పెడితే ఈ టైమ్‌లో పవన్ కళ్యాణ్ విడాకులు తీసుకోవడం తన పొలిటికల్ కెరీర్‌కు మరో మచ్చలా మిగిలిపోతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే చాలా మంది మాత్రం అది వాళ్ల పర్సనల్ లైఫ్.. విడాకులు తీసుకుంటారో, కలిసుంటారో అన్నది వాళ్ల ఛాయిస్. వాళ్ల డెసిషన్‌కు రెస్పెక్ట్ ఇవ్వాలి కానీ... ఇంకా బురద జల్లే ప్రయత్నాలు చేయడం సరికాదు అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు.భార్యాభర్తలు పరస్పర విశ్వాసం, గౌరవం, బాధ్యతతో జీవించాలని వివిధ ధర్మశాస్త్రాలు, సంప్రదాయాలు బోధిస్తాయి. వివాహం విఫలం అయితే జీవితాంతం బాధను భరించాలనే నియమమం సనాతన ధర్మంలో ఉందని చెప్పలేం. పెళ్లి, విడాకులు, పునర్వివాహాల విషయంలో హిందూ సంప్రదాయాల్లో భిన్నమైన అభిప్రాయాలు, ఆచారాలు ఉన్నాయి. ఆధునిక భారతీయ చట్టం కూడా విడాకులు, పునర్వివాహాలకు అవకాశం కల్పిస్తోంది. ఓ వ్యక్తి ఎన్ని వివాహాలు చేసుకున్నారనే సంఖ్య ఆధారంగా మాత్రమే వారి ధార్మికతను నిర్ణయించడం సరైన పద్ధతి కాదు. అదే సమయంలో ప్రతి వివాహంలోనూ భాగస్వామ్య గౌరవం, పిల్లల సంక్షేమం, కుటుంబ బాధ్యతలను ప్రాధాన్యత ఇవ్వడం అవసరం.ఆధ్యాత్మిక దృక్పథంలో చూస్తే వ్యక్తిగత జీవితంపై తీర్పు చెప్పడం కన్నా ఆ వ్యక్తి ప్రవర్తనలో ధర్మ విలువలు ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయో పరిశీలించడం ముఖ్యం. వివాహ బంధం కొనసాగపోవడానికి ఎన్నో వ్యక్తిగత కారణాలు ఉండొచ్చు. పూర్తి కారణాలు తెలియకుండా తప్పొప్పులు చెప్పడం సముచితం కాదంటారు ఆధ్యాత్మికవేత్తలు. సనాతన ధర్మం గురించి ప్రజలకు సందేశాలు ఇచ్చేనాయకులు తమ జీవితాల్లో సత్యం, నిబద్ధత, బాధ్యత, పరస్పర గౌరవం వంటి విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని అంతా ఆశించడం సహజం. సనాతన ధర్మం అంటే ఇతరులకు చెప్పేందుకు ఉపయోగించే నినాదం కాదు..అది మనిషి తన జీవితంలో ఆచరించాల్సిన విలువల సమాహారం. రాజకీయ నాయకుడు అయినా, ఆధ్యాత్మికవేత్త అయినా, సామాన్యుడు అయినా ధర్మం ముందు బాధ్యత ఒక్కటే. ధర్మం మాటల్లో కనిపించడం కన్నా చేతల్లో చూపించినప్పుడే సందేశం విలువ పెరుగుతుంది..

దక్షిణాదికి పాకిన 'సర్' నిరసనలు



న్యూఢిల్లీ,ప్రజా పార్లమెంటు– అక్కడినుంచి రామ్‌లీలా మైదానం వరకు.. ఆ తర్వాత కొచ్చిలో పెల్లుబికిన యువలోకం నిరసన.. ఓటర్ల జాబితాల ప్రక్షాళనలో పారదర్శకత కోసం కొనసాగుతున్న ఆందోళన ఉత్తరాది నుంచి దక్షిణాదికి క్రమక్రమంగా విస్తరిస్తోంది! మొదట ఢిల్లీకే పరిమితమైన నిరసన ఇప్పుడు దేశంలోని ఇతర ప్రాంతాలకూ వ్యాపిస్తోంది. అక్టోబర్ 31న ఢిల్లీలో జరిగిన ప్రజా పార్లమెంటు, నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' ర్యాలీ, నవంబర్ 7న కేరళలోని కొచ్చిలో జరిగిన 'జంతర్ మంతర్ ఏ కొచ్చి' నిరసన.. ఈ మూడు పరిణామాలు ఓటర్ల జాబితాలపై దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనకు అద్దం పడుతున్నాయి. ఎన్నికల్లో గెలుపోటములు రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కావచ్చు. కానీ ఓటు హక్కు మాత్రం ప్రతి పౌరుడి హక్కు. ఆ హక్కుకు భంగం కలుగుతోందనే అనుమానం వచ్చినప్పుడు ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజం. ఓటర్ల జాబితాల సవరణ పేరుతో అర్హులైన ఓటర్లు తమ హక్కును కోల్పోకూడదన్నదే ఈ ఆందోళనల ప్రధాన ఉద్దేశం.

ప్రజా పార్లమెంటులో ఆరు ప్రశ్నలు!

అక్టోబర్ 31న ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పార్లమెంటు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ సభకు అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ గాంధీ ముగింపు ప్రసంగం చేశారు. పౌరసమాజ ప్రతినిధులు, ప్రజాస్వామ్య హక్కుల కార్యకర్తలు, విద్యార్థి నాయకులు కూడా ఇందులో పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పనితీరుపై ప్రతిపక్షాలు ఆరు ప్రధాన ఆరోపణలు చేశాయి. ఓటర్ల పేర్ల తొలగింపు, ఫారం –6లో మార్పులు, ఇసిఐ నెట్ వ్యవస్థ వినియోగం, ఎన్నికల కమిషన్‌లోని ఇతర కమిషనర్ల పాత్రను పరిమితం చేయడం, అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరించడం వంటి అంశాలను లేవనెత్తాయి. ఎన్నికల జాబితాల నుంచి 13.2 కోట్ల మంది ఓటర్లను తొలగించారని ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి.అయితే ఇంత పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించిన ఆరోపణ వచ్చినప్పుడు ఎన్నికల సంఘం సమగ్రమైన, సంతృప్తికరమైన వివరణ ఇవ్వాలి. ఈ సభలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరా లేవనెత్తిన ప్రశ్నలు కూడా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత ఎంతవరకు ఉంది? ఫారం –6లో మార్పులకు కారణాలేమిటి? సాంకేతిక వ్యవస్థల ద్వారా ఓటర్ల జాబితాల్లో మార్పులు జరిగితే వాటిని పరిశీలించే స్వతంత్ర వ్యవస్థ ఉందా? ఎన్నికల కమిషనర్ల నియామకంలో ప్రభుత్వ ప్రభావం ఎంతవరకు ఉంటుంది? ఇలాంటి ప్రశ్నలు ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించినవే. ఈ సభలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై 'అభిశంసన' తీర్మానం కూడా ప్రవేశపెట్టారు. ఇది రాజ్యాంగ ప్రక్రియ ప్రకారం జరిగే పదవీచ్యుతి కాదు. కానీ ప్రజల సమక్షంలో రాజకీయ, నైతిక బాధ్యతను ప్రశ్నించే నిరసన కార్యక్రమంగా దీనిని పరిగణించవచ్చు.

రామ్‌లీలా మైదానంలో ప్రతిపక్షాల ఐక్యత!

మరుసటి రోజే, నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం మరో భారీ నిరసనకు వేదికైంది. 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో ఇండియా కూటమి ఈ ర్యాలీ నిర్వహించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, తేజస్వి యాదవ్, ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ తదితర నాయకులు పాల్గొన్నారు. వామపక్ష పార్టీల కార్యకర్తలు కూడా ర్యాలీలో భాగమయ్యారు. ఎన్నికల జాబితాల సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఓటు హక్కును ప్రజల గొంతుకగా అభివర్ణించారు. ఓటు హక్కుపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడేనని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. అయితే ఎన్నికల సంఘం వాదనను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అర్హత లేని, నకిలీ, మరణించిన లేదా ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లను తొలగించడమే సవరణల లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. తప్పుగా పేర్లు తొలగించబడినవారు తిరిగి నమోదు చేసుకోవచ్చని కూడా వివరిస్తున్నారు. ఇక్కడే అసలు ప్రశ్న ఉంది. అర్హులైన ఓటర్లకు తమ పేరు జాబితాలో ఉందో లేదో తెలుసుకునే అవకాశం ఎంత సులభంగా ఉంది? పేరు తొలగిస్తే ముందుగా సమాచారం అందుతోందా? అభ్యంతరం చెప్పడానికి తగిన సమయం, సౌకర్యం కల్పిస్తున్నారా?

కొచ్చిలో యువత నిరసన!

ఢిల్లీ నిరసనల ప్రభావం దక్షిణాదికీ చేరింది. నవంబర్ 7న కేరళలోని కొచ్చిలో 'జంతర్ మంతర్ ఏ కొచ్చి' పేరుతో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిరసన నిర్వహించింది. మెరైన్ డ్రైవ్ నుంచి రాజేంద్ర మైదాన్ వరకు జరిగిన ప్రదర్శనలో నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొని నాయకత్వం వహించారు. సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సభలో ప్రసంగించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షురాలు చింతా జెరోమ్ కూడా ప్రదర్శనలో పాల్గొన్నారు. పత్రికల కథనం ప్రకారం వేలాది మంది ఆందోళనకారులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థ స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పని చేయాలని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో సిజెపి నిర్వహించిన తొలి ప్రధాన నిరసనగా కొచ్చి కార్యక్రమాన్ని వార్తా సంస్థలు అభివర్ణించాయి. ఈ పరిణామం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఓటర్ల జాబితాలపై ఆందోళన కేవలం రాజకీయ పార్టీల మధ్య వివాదంగా మిగలడం లేదు. విద్యార్థులు, యువత, పౌరహక్కుల కార్యకర్తలు, కళాకారులు కూడా ఈ చర్చలో భాగమవుతున్నారు. ఓటు హక్కు విషయంలో ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది.

తెలంగాణలోనూ అప్రమత్తత అవసరం!

ఈ జాతీయ చర్చ తెలంగాణలో కూడా ఎంతో ప్రాసంగికతను సంతరించుకుంది. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భారీ సంఖ్యలో ఓటర్లు ఎఎస్‌డిడి (ూూణణ) కేటగిరీలోకి వెళ్లారు. అంటే గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదు వంటి కారణాలతో గుర్తించినవారు. ఎస్ఐఆర్ ప్రారంభానికి ముందు తెలంగాణలో 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 2,64,87,213 మంది ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించారు. మిగిలిన 73,39,235 మందిని ఎఎస్‌డిడి కేటగిరీలో చేర్చి ఆగస్టు 17న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు కల్పించలేదు. ఈ సంఖ్యలో 57.46 లక్షల మంది గైర్హాజరు లేదా చిరునామా మారినవారిగా, 9.22 లక్షల మంది మరణించినవారిగా, 6.70 లక్షల మంది డూప్లికేట్ నమోదులుగా గుర్తించారు.అయితే ఈ 73.39 లక్షల మందినీ అర్హులైన ఓటర్లుగా భావించలేం. అలాగే వారందరినీ శాశ్వతంగా తొలగించినట్లుగానూ చెప్పలేం. ప్రతి ఒక్కరి వివరాలను విడివిడిగా పరిశీలించాలి. నిజంగా మరణించినవారు, ఇతర చోట్ల నమోదైనవారు ఒకవైపు ఉంటే, తాత్కాలికంగా అందుబాటులో లేకపోయినవారు, చిరునామా మారినవారు మరోవైపు ఉంటారు. ఈ తేడాను గుర్తించడం చాలా ముఖ్యం. నవంబర్ 7న తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అర్హులైన ఓటర్లు తమ పేర్లను తిరిగి చేర్చుకునేందుకు మరో అవకాశం వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బూత్ స్థాయి అధికారులు మళ్లీ సంప్రదింపులు జరపాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు నవంబర్ 21 వరకు అవకాశం కల్పించారు. నోటీసులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ నవంబర్ 26తో ముగియనుంది. తుది ఓటర్ల జాబితా నవంబర్ 30న ప్రకటించనున్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతి రాజకీయ పార్టీ తన బూత్ స్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలి. ప్రతి ఓటరు తన పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలి. పేరు లేకపోతే సంబంధిత బూత్ స్థాయి అధికారి లేదా ఎన్నికల అధికారిని సంప్రదించాలి. అర్హులైన ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోకుండా చూడాలి. ఇది కేవలం ప్రతిపక్షాల బాధ్యత కాదు. అధికార పక్షం కూడా అంతే బాధ్యతతో వ్యవహరించాలి.

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది!

ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ. దాని విశ్వసనీయత ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకం. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి, ప్రజలకు అందుబాటులో ఉండే సమాచార వ్యవస్థ తప్పనిసరి. ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని కొట్టిపారేయడం కంటే ఆధారాలతో సమాధానం చెప్పడం మంచిది. అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా నిర్ధారణ కాని ఆరోపణలను వాస్తవాలుగా ప్రచారం చేయకూడదు. ఓటర్ల జాబితాల ప్రక్షాళన అవసరమే. కానీ ఆ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కు తొలగిపోకూడదు. సాంకేతికతను ఉపయోగించవచ్చు. కానీ అది ప్రజలకు ఇబ్బంది కలిగించే సాధనంగా మారకూడదు.పేదలు, వలస కార్మికులు, నిరాశ్రయులు, వృద్ధులు, చిరునామాలు మారినవారు తమ హక్కును నిరూపించుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదు. ఢిల్లీ నుంచి కొచ్చి వరకు వినిపిస్తున్న నిరసనల వెనుక ఉన్న ప్రధాన ప్రశ్న ఇదే. ఓటర్ల జాబితాలో పేరు ఉండటం ఒక పౌరుడి ప్రజాస్వామ్య ఉనికికి గుర్తింపు. ఆ గుర్తింపును తొలగించే ప్రతి చర్య పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలి. ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం

తెలంగాణ ఇంటర్ బోర్డులో వింత పోకడలు



హైదరాబాద్, ఇంటర్మీడియట్ విద్యామండలి లో ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ వింగ్ (ఈఆర్టీడబ్ల్యూ) ప్రక్షాళనపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠ్యాంశాల రూపకల్పన, వృత్యంతర శిక్షణ, నాణ్యత ప్రమాణాల పెంపు వంటి కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన ఈ విభాగంలో అధికారుల అలసత్వం వల్ల ఆశించిన మార్పులు రావడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా సిలబస్ కమిటీలు, ఈఆర్టీడబ్ల్యూ విషయంలో అధికారులు స్పందించి ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. గతంలో పనిచేసిన సెక్రటరీ హయాంలో ఈఆర్టీడబ్ల్యూలో పారదర్శకత కోసం ఓపెన్ యాక్సెస్ పద్ధతి ద్వారా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ విభాగానికి సంబంధించి దాదాపు 70 అప్లికేషన్లు వచ్చినప్పటికీ, నేటికీ ఆ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లలేదు. వచ్చిన దరఖాస్తులను పక్కనబెట్టి, పాతవారినే కొనసాగించడంపై బోర్డు అధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

జూనియర్లకే ప్రాధాన్యం..

సిలబస్ కమిటీల ఏర్పాటు, రీసెర్చ్ విభాగ నియామకాల్లో సీనియారిటీ, పరిశోధన అనుభవాన్ని పూర్తిగా పక్కనబెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీనియర్ అధ్యాపకులను, అర్హత కలిగిన నిపుణులను విస్మరించి, సరైన రీసెర్చ్ అనుభవం లేని జూనియర్లకే అధికారులు ప్రాధాన్యమిస్తున్నారని సమాచారం. అయితే ఇటీవల సిలబస్ కమిటీల్లో 2008 బ్యాచ్‌కు చెందిన సీనియర్లు, రీసెర్చ్ అనుభవం ఉన్నవారిని కాదని, 2012లో నియమితులైన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో కనీసం బీఈడీ, ఎంఈడీ లేనివాళ్లు, రిటైర్డ్ ప్రిన్సిపాల్స్, లెక్చరర్స్ కూడా ఉండడం గమనార్హం. రిటైర్డ్ అయిన వారితో సిలబస్ తయారు చేయిస్తే తప్పులు దొర్లినప్పుడు వాటిని సరిచేసే అవకాశం ఉండదు. అంతేకాకుండా ఇందులో రిటైర్డ్ అయి హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ కోచింగ్ సెంటర్ పనిచేస్తున్న పాలిటీ అధ్యాపకుడుకి కూడా స్థానం కల్పించారు. డిప్యూటేషన్ పద్ధతిలో ఈఆర్టీడబ్లూలో లైబ్రేరియన్లకు సైతం స్థానం కల్పించారంటే ఇంటర్ బోర్డులో అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పైరవీలకు ఆస్కారం..

విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే ఈఆర్టీడబ్ల్యూ విషయంలో రాజకీయ నాయకుల జోక్యం, పలు యూనియన్ల నుంచి పైరవీలు చేసుకుని కొనసాగుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వీరు హైదరాబాద్‌కి సమీపంలో ఉండడం, తరుచుగా ఇంటర్ బోర్డు కార్యాలయానికి రావడం, డిప్యూటేషన్లు తదితర కారణాలతో పైరవీలతో పనులు చేసుకుంటున్నారు. సిలబస్ కమిటీలలో సీనియారిటీని తుంగలో తొక్కి 2008 వాళ్లను కాదని, 2012 వాళ్లకు అవకాశం కల్పించడంపై ఏంటనే చర్చ నడుస్తోంది.

మార్పులు చేపట్టాలి..

ఇప్పటికైనా ఇంటర్ బోర్డు స్పందించి ఈఆర్టీడబ్లూలోకి ఒక్కొక్క సబ్జెక్టులో విషయ పరిజ్ఞానం ఉన్నవారిని తీసుకుని సిలబస్ కమిటీలో స్థానం కల్పించాల్సిన అవసరం ఉంది. జాతీయస్థాయిలో ఎన్సీఈఆర్టీ, రాష్ట్రస్థాయిలో ఎస్సీఈఆర్టీ తరహాలో పరిశోధనా నేపథ్యం, బోధనా అనుభవం ఉన్నవారిని తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యా నిపుణులు, పలువురు ప్రొఫెసర్లు సూచిస్తున్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

గతం గతహ కాకుండా గతం ఎప్పుడూ మనకు కొత్తదనాన్ని పరిచయం చేస్తూ రేపటి తరానికి మార్గదర్శకం మరియు పునర్నిర్మాణం కావి స్తుంది అట్లాగే కొన్ని పండగలకి కుల మత భాష అడ్డుగోడలు గా ఉండవు. అన్ని కులాలు మతాలు వివిధ రకాల భాషలు మాట్లాడేవారు చేసుకునె పండుగలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. మన దేశ ఔన్నత్యానికి అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయులు జయంతుల పేరుతో వారు చేసిన సేవలను గుర్తు చేస్తారు వాటిలో ఒకటి బాలల దినోత్సవం మన దేశ మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ గారికి పిల్లలంటే అమితమైన ప్రేమ తన పుట్టినరోజును ఆయన జీవించి ఉన్నప్పుడు పిల్లలతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకునే వారు, నెహ్రూ గారు దేశ స్వాతంత్రం కోసం తనకున్న సమస్థాన్ని పణంగా పెట్టి ఎన్నో కష్టాల్ని భరించాడు జైల్లో ఉన్నప్పుడే భార్య కమల భాయి మరణించింది. స్వతంత్ర సమూపార్జన కోసం జైల్లో ఉన్నప్పుడే ఆయన ప్రపంచ చరిత్ర డిస్కవరీ ఆఫ్ ఇండియా లాంటి ప్రత్యేక గ్రంథాన్ని రాశారు దేశం కోసం ఎలాంటి త్యాగానికైనా వినకాడలేదు.. 1964 నవంబర్ నెహ్రూ గారు మరణించిన తర్వాత ఆయనపై ఉన్న గౌరవం పిల్లల పట్ల అమితమయిన ప్రేమ కు గుర్తు గా ప్రతి సంవత్సరం నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవం జరుపుకోవడం ప్రారంభించారు. ఈ రోజున పిల్లలకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించడానికి పిల్లల సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించి వారికి మెరుగైన ఆరోగ్య సదుపాయాలు మరియు విద్యను అందించాలని ఈ బాలల దినోత్సవం ముఖ్య ఉద్దేశం.మాజీ అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి పిల్లలే దేశ భవిష్యత్తు అనేవారు పిల్లల అభివృద్ధి విద్య ఆరోగ్యం మరియు సంక్షేమంపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది బాలల దినోత్సవం రోజున ప్రతి పాఠశాలలో పిల్లల కొరకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు అందులో భాగంగా డిబేట్స్ చిత్ర లేఖనం వేషధారణ గాన పోటీలో నృత్య పోటీలు వ్యాసరచన పోటీలు వకృత్వ పోటీలు క్విజ్ పోటీలు ముగ్గుల పోటీలు జ్ఞాపకశక్తి పోటీలు కవిత రచన పోటీలు ఇలా పలు విభాగాలలో పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను ప్రధానంచేస్తారు. మిఠాయిలను పంచిపెడతారు ఆ రోజు పిల్లలంతా ఎంతో ఉత్సాహంగా ఆనందంగా ఉల్లాసంగా గడుపుతారు శ్రీమతి ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు తన తండ్రికి పిల్లల పట్ల ఉన్న అమోఘమైన ప్రేమకు గుర్తుగా ఉమ్మడి తెలంగాణ రాష్ట్రంలో 1966 జూన్ 23వ తేదీన నగరం నడిబొడ్డ న పబ్లిగా ర్డెన్స్ నందు ప్రత్యేకంగా 16 సంవత్సరాల పిల్లలకు తన తండ్రి పేరున జవహర్ బాలభవన్ ను ప్రారంభించారు. పిల్లలు ఆడుతూ పడుతూ లలిత కళల పట్ల శిక్షణ తీసుకొనుట కు ఏర్పాటు చేసినారు..కావున బాలలందరు సంతోషంగా నద్వినియోగ పరుచుకుంటున్నారు.



– కొమ్ము వరలక్ష్మి

సమన్వయ లోపమే..శాపమా

కర్నూలు, వైసీపీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు దక్కలేదు. అది ఊహించింది అయినా స

బడి కోసం పోర్టల్ ద్వారా 10 కోట్ల నిధులు

నెల్లూరు,ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీలకు మౌలిక వసతుల కల్పించేందుకు దాతల నుంచి ప్రభుత్వం విరాళాలు సేకరిస్తోంది. 'బడి కోసం' పేరుతో పోర్టల్‌ను ప్రారంభించి దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ బడి కోసం పోర్టల్ ద్వారా విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది జులై 24న పోర్టల్‌ను ప్రారంభించగా.. ఇప్పటి వరకు దాతలు రూ. 9.78 కోట్లు అందించారు. వస్తువులు, సివిల్ వర్క్స్ రూపంలో సాయం అందించారు.రాష్ట్రవ్యాప్తంగా 1,541 ప్రభుత్వ స్కూళ్లకు 1,679 మంది దాతలు విరాళాలు అందించారు.కొంతమంది దాతలు సర్కారు బడుల అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు తమ స్థాయికి తగ్గట్టు తక్కువ మొత్తంలో విరాళాలు అందిస్తున్నారు. ఈ విరాళాలలో అత్యధికంగా పల్నాడు జిల్లాకు రూ. 89.36 లక్షలు, శ్రీకాకుళం జిల్లాకు రూ. 73.28 లక్షలు, చిత్తూరుకు రూ. 60.39 లక్షలు విరాళాల రూపంలో వచ్చాయి. రాష్ట్రంలో మొత్తం మీద 43,068 బడులకు పూర్తిస్థాయిలో అన్నిరకాల వసతులు కల్పించేందుకు రూ. 6,320 కోట్లు అవసరమని అంచనా వేశారు. బడి కోసం పోర్టల్ ద్వారా ప్రతి స్కూల్‌కు అవసరమైన సామాగ్రి, సివిల్ వర్క్స్ వివరాలను అందుబాటులో ఉంచారు. అదనంగా తరగతి గది నిర్మించడానికి రూ. 18.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు.స్కూల్‌లో తరగతి గది, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు దాతలు పూర్తిమొత్తం అందించాల్సి ఉంటుంది. విరాళాలు అందించే దాతలకు విద్యాశాఖ మంత్రి లోకేష్ నుంచి ప్రశంసాపత్రం అందుతుంది. ఈ విరాళాలు ఇవ్వాలనుకుంటున్న దాతలు ముందుగా పోర్టల్‌లో వ్యక్తిగత వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఒకవేళ దాతలు ఎవరైనా తరగతి గదులు, భవన నిర్మాణానికి పూర్తిగా నిధులిస్తే.. ఆ దాతల పేర్లను ఆయా గదులు, భవనాలకు పెడతారు. విద్యార్థులు కూర్చోవడానికి 11,080 డ్యుయల్ డెస్క్‌లు, 14,031 బడులకు గ్రీన్ చాక్‌పీస్ బోర్డులు అవసరమని అంచనా వేశారు.ఈ బడి కోసం పోర్టల్‌ను ప్రారంభించిన రోజే నెల్లూరు జిల్లాకు చెందిన ఓ పారిశ్రామికవేత్త రూ. 4 కోట్లు విరాళంగా అందించారు. పోలవరం జెడ్పీ స్కూల్‌లో చదువుకుని.. ఆ దగ్గర్లోనే జిరాక్స్ కేంద్రాన్ని నడుపుతున్న మరో వ్యక్తి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. సివిల్ వర్క్స్‌లో భాగంగా స్కూల్ గ్రౌండ్ అభివృద్ధి, తలుపులు, కిటికీలు, డెస్కులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, తరగతి గదుల నిర్మాణం వంటి అంశాలు కూడా ఉన్నాయంటున్నారు అధికారులు. మొత్తం మీద బడి కోసం పోర్టల్‌కు దాతల నుంచి మంచి స్పందన వస్తోంది. చాలామంది విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విరాళాలు వస్తాయని చెబుతున్నారు.

సస్పెన్షన్ లో రిటైర్మెంట్...

విజయవాడ,ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి, అడిషనల్ డీజీపీ ఎన్. సంజయ్‌కు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన సస్పెన్షన్‌ను మరోసారి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన వయోపరిమితి ప్రకారం పదవీ విరమణ పొందే 2027 మార్చి 31వ తేదీ వరకు లేదా ఆయనపై ఉన్న క్రిమినల్ విచారణ పూర్తయ్యే వరకు ఏది ముందైతే అది సస్పెన్షన్ వేటు కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ అధికారిక జీవో జారీ చేశారు.గత ప్రభుత్వ హయాంలో ఏపీ సీఐడీ అడిషనల్ డీజీపీగా, అలాగే విపత్తు నిర్వహణ-అగ్నిమాపక సేవల శాఖ డీజీగా పనిచేసిన సమయంలో సంజయ్ భారీగా నిధుల మళ్లింపునకు పాల్పడ్డారని అభియోగాలు నమోదు అయ్యాయి. అగ్ని వెబ్ పోర్టల్ నిర్వహణకు కేటాయించిన ప్రభుత్వ నిధులను పక్కదోవ పట్టించడంతో పాటు, సీఐడీ చీఫ్‌గా ఎస్సీ, ఎస్టీ చట్టంపై పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు కేటాయించిన నిధుల్లో రూ. 1.15 కోట్లు దుర్వినియోగం చేశారనే ప్రాథమిక ఆధారాలు లభించాయి. దీంతో ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్-1969 కింద ప్రభుత్వం ఆయనపై 2024 డిసెంబర్ 3న తొలిసారి సస్పెన్షన్ విధించింది.విజయవాడ ఏసీబీ 2024 డిసెంబర్ 24న సంజయ్‌పై అవినీతి నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణను వేగవంతం చేసింది. దీనికితోడు సీనియర్ ఐపీఎస్ అధికారి కుమార్ విశ్వజిత్ నేతృత్వంలో ఆయనపై రెగ్యులర్ శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతోంది. కీలక సాక్షుల విచారణ కొనసాగుతుండటం, ఫొరెన్సిక్ ల్యాబ్ నివేదికలు ఇంకా రావాల్సి ఉండటంతో సమీక్షా కమిటీ సమావేశమై సస్పెన్షన్‌ను కొనసాగించాలని సిఫార్సు చేసింది.హోదా రీత్యా సీనియర్ ఐపీఎస్ అధికారి కావడంతో, ఒకవేళ సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకుంటే సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, ఆధారాలను తారుమారు చేసే అవకాశం ఉందన్న ఏసీబీ డీజీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో విచారణలన్నీ పూర్తికాకుండా సర్వీసులోకి వచ్చే అవకాశం లేకపోవడంతో ఆయన రిటైర్మెంట్ కూడా సస్పెన్షన్ కాలంలోనే ముగియనుంది. ఈ వ్యవహారంలో తదుపరి చట్టపరమైన చర్యలు వేగంగా చేపట్టాలని ప్రభుత్వం డీజీపీని ఆదేశించింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభావం

మహబూబ్ నగర్, తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి అగ్నిపరీక్షగా మారే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చూపుతున్న అలసత్వం.. ముఖ్యంగా రెండో వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) అమలుపై నెలకొన్న ప్రతిష్టంభన ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. తమ చిరకాల డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేయడమే కాకుండా, స్వయంగా ప్రచారం చేసి గుణపాఠం చెబుతామని ఉద్యోగ సంఘాలు హెచ్చరిస్తుండటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోందిప్రస్తుతం మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్, అలాగే వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని ఆరు జిల్లాల్లో కలిపి సుమారు నాలుగు లక్షల మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ సిబ్బంది గ్రాడ్యుయేట్లుగా ఉన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. పట్టభద్రుల స్థానాల్లో ఫలితాలను తారుమారు చేయగల సంఖ్యాబలం వీరికి ఉండటంతో, ఉద్యోగ వర్గాల అసహనం నేరుగా ఫలితాలపై ప్రభావం చూపే ప్రమాదం ఏర్పడింది.నవంబర్ 6న నాంపల్లిలోని టీజీవో భవన్‌లో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్‌పర్సన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. మూడేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా జూలై 1, 2023 నుంచి వర్తించేలా 51శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీ నివేదికను తక్షణమే విడుదల చేసి అమలు చేయాలని జేఏసీ పట్టుబడుతోంది. గతంలో జూన్ 2 నాటికి కమిషన్ నుంచి నివేదిక తెప్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదని నేతలు గుర్తుచేశారు. అలాగే ఉద్యోగులకు రావాల్సిన వివిధ బిల్లుల బకాయిలు ప్రస్తుతం రూ. 10,000 కోట్ల మార్కును దాటాయి. వీటిని క్లియర్ చేయడానికి ప్రభుత్వం ప్రతినెలా కేటాయిస్తున్న మొత్తాన్ని ప్రస్తుత రూ. 1,000 కోట్ల నుంచి రూ. 2,000 కోట్లకు పెంచాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్

హరీశ్ కంచుకోటలో రేవంత్ రాజకీయ రణం





మరింత ఆజ్యం పోసే అవకాశముంది.

సిద్దిపేట,గులాబీ జెండాకు కంచుకోట.. బీఆర్ఎస్ రాజకీయాలకు బలమైన పునాది.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రాజకీయ ప్రాబల్యానికి ప్రతీకగా నిలిచిన సిద్దిపేట ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి కేంద్రబిందువుగా మారుతోంది. హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో పాగా వేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండగా, తన రాజకీయ పునాదులను కాపాడుకోవడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు హరీశ్‌రావు తనదైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కల్వకుంట్ల కవిత పర్యటన, 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ ఒకే వారంలో జరగనుండటం జిల్లా రాజకీయాల్లో వేడిని పెంచుతోంది.సాధారణంగా అధికార పార్టీ ముఖ్యమంత్రి పర్యటన అంటే ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలు సహజం. కానీ ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు బలమైన రాజకీయ స్థావరంగా ఉన్న సిద్దిపేటలోనే సీఎం సభ నిర్వహిస్తుండటంతో దీనికి రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో సభలు నిర్వహిస్తామని కాంగ్రెస్ నాయకత్వం ప్రకటించిన నేపథ్యంలో రేవంత్ పర్యటనను రాజకీయ కోణంలోనూ పరిశీలిస్తున్నారు.

హరీశ్ పట్టు.. కాంగ్రెస్ ముందున్న సవాలు!

సిద్దిపేటలో హరీశ్‌రావు రాజకీయ బలం ఒక్క ఎన్నికల విజయాలకే పరిమితం కాలేదు. గ్రామస్థాయి కార్యకర్తలతో సంబంధాలు, ప్రజా సమస్యలపై స్పందన, అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలకంగా నిలిచాయి. కేసీఆర్ రాజకీయ ఎదుగుదలతో పాటు సిద్దిపేటను బీఆర్ఎస్ బలమైన కేంద్రంగా తీర్చిదిద్దడంలోనూ ఆయన పాత్ర ప్రాధాన్యత సంతరించుకుంది.అధికారం కోల్పోయిన తర్వాత కూడా హరీశ్‌రావు నియోజకవర్గంలో రాజకీయంగా క్రియాశీలకంగానే కొనసాగుతున్నారు. రైతుల సమస్యలు, విద్యుత్ సరఫరా, ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి, రహదారులు, నిలిచిపోయిన అభివృద్ధి పనులు వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. సిద్దిపేటకు గతంలో మంజూరైన వెటర్నరీ కళాశాల, కొమటి చెరువు శిల్పారామం, రంగనాయకసాగర్ పర్యాటక అభివృద్ధి తదితర పనులు నిలిచిపోయాయని, కొన్ని ప్రాజెక్టులను ఇతర ప్రాంతాలకు తరలించారని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం నుంచి సమగ్ర వివరణ రావాల్సి ఉంది.అక్టోబర్‌లో జిల్లా పదో ఆవిర్భావ దినోత్సవ సభలోనూ గతంలో ప్రారంభించిన ప్రాజెక్టులను పూర్తి చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు విద్యుత్ సమస్య, రైతు బీమా ప్రయోజనాలు అందకపోవడం వంటి అంశాలను కూడా ఆయన రాజకీయ అజెండాలోకి తీసుకొచ్చారు. దీంతో సిద్దిపేట అభివృద్ధి ఇప్పుడు అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

రేవంత్ సభకు రాజకీయ ప్రాధాన్యత!

ఈ నెల 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నారు. ప్రతి అర్హ కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా కల్పించాలన్నది ఈ పథకం లక్ష్యం. అదే కార్యక్రమంలో ఇందిరమ్మ చీరల పంపిణీని కూడా ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న ఈ సంక్షేమ కార్యక్రమాలకు సిద్దిపేటను వేదికగా ఎంచుకోవడం రాజకీయంగా ఆసక్తిని కలిగిస్తోంది.సిద్దిపేట సభ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపాలని అధికార పార్టీ భావిస్తోంది. సభ ఏర్పాట్లను మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి పరిశీలించడం, జిల్లా యంత్రాంగం ఏర్పాట్లపై దృష్టి పెట్టడం కార్యక్రమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తోంది.అయితే ఈ సభలో సీఎం కేవలం సంక్షేమ పథకాల గురించే మాట్లాడతారా? లేక సిద్దిపేట అభివృద్ధి, గత బీఆర్ఎస్ పాలన, కాళేశ్వరం, మల్లన్నసాగర్ అంశాలను కూడా ప్రస్తావిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి ప్రసంగం, స్థానిక కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు రాజకీయ చర్చకు

హరీశ్ ఎదురుదాడిలో అభివృద్ధి అస్త్రం!

కాంగ్రెస్ సభకు హరీశ్‌రావు తనదైన రాజకీయ సమాధానం ఇచ్చే అంశంపై ఆసక్తి నెలకొంది. ప్రభుత్వంపై విమర్శలు చేయడం మాత్రమే కాకుండా, గతంలో మంజూరైన పనులు ఎందుకు నిలిచిపోయాయి? వాటి పునరుద్ధరణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి? కొత్తగా ఎన్ని నిధులు కేటాయించింది? వంటి ప్రశ్నలను ఆయన ప్రజల ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది.రంగనాయకసాగర్, కొమటి చెరువు, వెటర్నరీ కళాశాల, బైటర్ రింగ్ రోడ్డు, క్రీడా మైదానం వంటి అంశాలు మరోసారి రాజకీయ చర్చలోకి వచ్చే అవకాశముంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులపై బీఆర్ఎస్ తన వాదనను వినిపిస్తుండగా, వాటి ప్రస్తుత స్థితి, నిధుల కేటాయింపులు, పనుల పురోగతిపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.హరీశ్‌రావుకు ఇప్పుడు మరో బాధ్యత కూడా ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల మధ్య నిరంతరం ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాడటం, గత పాలనలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రయోజనాలను వివరించడం, కొత్త ప్రభుత్వ నిర్ణయాలపై నిర్మాణాత్మకంగా ప్రశ్నించడం ఆయన రాజకీయ కార్యాచరణకు కీలకం కానుంది.

13న కవిత అడుగు.. బీఆర్ఎస్‌కు సంస్థాగత బలం!

మరోవైపు నవంబర్ 13న కల్వకుంట్ల కవిత సిద్దిపేట పర్యటన కూడా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి ఆమె భూమిపూజ చేయనున్నారు. ఉద్యమగడ్డపై పార్టీ కార్యాలయం నిర్మాణం ద్వారా కార్యకర్తలకు ప్రత్యేక వేదిక కల్పించడంతో పాటు సంస్థాగత కార్యక్రమాలను విస్తరించాలన్నది ఆ పార్టీ లక్ష్యంగా కనిపిస్తోంది.కవిత పర్యటనతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కదలిక మొదలుకానుండగా, ఆరు రోజుల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి సభ జరగనుండటం రెండు పార్టీల రాజకీయ కార్యక్రమాల మధ్య ఆసక్తికరమైన సమయ సమీకరణంగా మారింది. అయితే కవిత పార్టీ కార్యాలయ కార్యక్రమం, హరీశ్‌రావు స్థానిక నాయకత్వం, కేసీఆర్ పార్టీ అధినాయకత్వం.. ఈ అంశాలన్నింటి మధ్య బీఆర్ఎస్ తన రాజకీయ కార్యాచరణను ఎలా సమన్వయం చేసుకుంటుందన్నది కూడా గమనించాల్సిన అంశం.

హరీశ్ వర్సెస్ రేవంత్.. మాటల యుద్ధానికి రంగం సిద్ధమా?

ఇటీవలి కాలంలో హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు అంశాల్లో తీవ్ర విమర్శలు చేస్తున్నారు. రేషన్ డీలర్ల సమస్యలు, విద్యుత్ సరఫరా, రైతుల ఇబ్బందులు, ప్రభుత్వ హామీల అమలు వంటి అంశాలపై ఆయన చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రస్థాయి రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ నేతలు కూడా సిద్దిపేటలో బీఆర్ఎస్ పాలనను ప్రశ్నిస్తూ పార్టీ బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో నవంబర్ 19న సీఎం సభకు స్థానిక ఎమ్మెల్యేగా హరీశ్‌రావు హాజరవుతారా? హాజరైతే ముఖ్యమంత్రితో ఒకే వేదికను పంచుకుంటారా? సభలో ఆయన ప్రస్తావన వస్తే ఎలా స్పందిస్తారు? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. అయితే ఆయన హాజరుపై ఇప్పటివరకు నిర్ధారణ లేదు.

సభల సందడి కాదు.. అభివృద్ధే అసలు గీటురాయి!

సిద్దిపేటలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న రాజకీయ పోటీని కేవలం రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు వ్యక్తిగత రాజకీయ సమరంగా చూడలేం. అధికారంలో ఉన్న కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, అభివృద్ధి హామీలను అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని పొందాల్సి ఉంది.

ఢిల్లీకి ఏటా తప్పని కాలుష్యం కాటు



న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీ మరోసారి వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. శీతాకాలం ప్రారంభం కాగానే నగరాన్ని విషపూరితమైన పొగమంచు కమ్మేయడం, వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) ప్రమాదకర స్థాయికి చేరడం, ప్రజలు శ్వాస తీసుకోవడానికి కూడా ఇబ్బందులు పడటం ఏటా పరిపాటిగా మారిపోయింది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటిగా ఢిల్లీ నిలుస్తుండటం దేశ ప్రతిష్ఠకు కూడా మచ్చగా పరిణమిస్తోంది. ఒకవైపు అభివృద్ధి, ఆధునిక మౌలిక సదుపాయాలు, ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షలు వ్యక్తమవుతుంటే.. మరోవైపు కోట్లాది మంది ప్రజలకు స్వచ్ఛమైన గాలి కూడా అందించలేని దుస్థితి నెలకొనడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం. కాలుష్యం ఏదో ఒక సీజన్‌లో వచ్చే సమస్య కాదు. అది ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న జాతీయ సంక్షోభం.ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రతకు అనేక కారణాలున్నాయి. వాహనాల నుంచి వెలువడే పొగ, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ రంగం నుంచి వచ్చే దుమ్ము, రోడ్లపై పేరుకుపోయే ధూళి, బొగ్గు, ఇతర ఇంధనాల వినియోగం ప్రధాన కారణాలుగా ఉన్నాయి. శీతాకాలంలో గాలి వేగం తగ్గడం, ఉష్ణోగ్రతలు పడిపోవడం, వాతావరణంలో గాలి కదలికలు మందగించడం వల్ల కాలుష్య కారకాలు భూమికి దగ్గరగా పేరుకుపోతాయి. ఫలితంగా పొగమంచు, విషవాయువుల మిశ్రమం నగరాన్ని కప్పేస్తుంది. దీనికి పొరుగున ఉన్న పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగులబెట్టడం కూడా తోడవుతోంది. కాలుష్యం ప్రభావం ప్రజల ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, గుండె జబ్బులు, ఊబకాయం, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గాలిలో ఉండే పీఎం 2.5, పీఎం 10 వంటి సూక్ష్మధూళి కణాలు ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోయి శ్వాసకోశ వ్యవస్థను దెబ్బతీస్తాయి. పీఎం 2.5 కణాలు మరింత ప్రమాదకరమైనవి. ఇవి ఊపిరితిత్తుల లోతైన భాగాలకు చేరడమే కాకుండా రక్తప్రవాహంలోకి ప్రవేశించే అవకాశం కూడా ఉంది. దీర్ఘకాలం ఇటువంటి కాలుష్యానికి గురికావడం వల్ల గుండె జబ్బులు, పక్షవాతం, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యల ముప్పు పెరుగుతుంది. ఢిల్లీ కాలుష్య సమస్యకు పరిష్కారం కనుగొనాలంటే రాజకీయ సంకల్పం, సమన్వయం, నిరంతర పర్యవేక్షణ అవసరం. ఢిల్లీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు సమష్టిగా పనిచేయాలి. పంట వ్యర్థాల దహనాన్ని నివారించడానికి రైతులకు ప్రత్యామ్నాయాలు కల్పించాలి. పంట అవశేషాలను తొలగించేందుకు అవసరమైన యంత్రాలను సబ్సిడీపై అందించాలి.వాటిని సేకరించి జీవ ఇంధనాలు, కంపోస్టు, ఇతర పారిశ్రామిక అవసరాలకు వినియోగించే వ్యవస్థలను అభివృద్ధి చేయాలి. మరోవైపు వాహన కాలుష్యాన్ని తగ్గించడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తరించి, మెట్రో రైలు, ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచాలి. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించేలా సౌకర్యవంతమైన ప్రయాణ ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకురావాలి. పాత డీజిల్ వాహనాల స్థానంలో కాలుష్య రహిత వాహనాలను ప్రోత్సహించాలి. వాహనాల కాలుష్య ఉద్గార పరీక్షలను కఠినతరం చేయాలి. పరిశ్రమల్లో ఆధునిక కాలుష్య నియంత్రణ పరికరాలను తప్పనిసరి చేయాలి. నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలి.నిర్మాణ ప్రదేశాల్లో దుమ్ము బయటకు వ్యాపించకుండా కప్పివేయడం, నీటిని చల్లడం, నిర్మాణ వ్యర్థాలను సక్రమంగా తొలగించడం వంటి చర్యలను పర్యవేక్షించాలి. ఇటీవల కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) సమీక్షించిన నిపుణుల నివేదిక కూడా ఢిల్లీ కాలుష్యానికి ఒకటి కంటే ఎక్కువ కారణాలున్నాయని స్పష్టం చేసింది. ఐఐటిలు, పరిశోధనా సంస్థలు, విద్యాసంస్థలకు చెందిన 33మంది నిపుణులు రూపొందించిన నివేదికలో పీఎం 2.5 ప్రధాన కాలుష్య కారకంగా గుర్తించారు.రవాణా, పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాలు, జీవపదార్థాల దహనం వంటి వాటి నుంచి వెలువడే ఉద్గారాలు కాలుష్యాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలో కాలుష్యం ఇప్పుడు కేవలం ఆ నగరానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, చెన్నై వంటి ప్రధాన నగరాల్లోనూ వాయు కాలుష్యం క్రమంగా పెరుగుతోంది. ఢిల్లీలో కనిపిస్తున్న పరిస్థితి మిగిలిన నగరాలకు ఒక హెచ్చరికగా భావించాలి. అక్కడి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలి. ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించడం ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన అంశం కాదు. అది వారి ప్రాథమిక హక్కు. ఈ హక్కును కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే.

సీనియర్ ఐపీఎస్ అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు.. నవంబర్ 13న హైకోర్టు విచారణ

విజయవాడ:రాష్ట్రంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న, పదవీ విరమణ చేసిన పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులపై దాఖలైన కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలపై ఏపీ హైకోర్టు ఈ నెల 13న విచారణ జరపనుంది. ఉద్యోగుల సర్వీసు అంశాల్లో న్యాయస్థానం గతంలో వెలువరించిన తీర్పులను ఉద్దేశపూర్వకంగా అమలు చేయడం లేదంటూ దాఖలైన పలు పిటిషన్లను జస్టిస్ రవినాథ్ తిలహరి, జస్టిస్ ఆలపాటి గిరిధర్‌లతో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఈ పిటిషన్లను సచివాలయ సిబ్బంది, ఆర్ అండ్ బీ ఇంజనీర్లు, టీటీడీ ఉద్యోగులు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, పదవీ విరమణ చేసిన పలువురు ఉద్యోగులు దాఖలు చేశారు. సూపర్‌న్యూమరరీ పోస్టుల కేటాయింపు, అంతర్రాష్ట్ర సీనియారిటీ నిబంధనల అమలు, ఇతర సర్వీసు ప్రయోజనాల కల్పన వంటి అంశాలపై 2018 నుంచి న్యాయస్థానం ఇచ్చిన పలు ఉత్తర్వులను అధికారులు అమలు చేయడం లేదని పిటిషనర్లు ఆరోపిస్తున్నారు. అక్టోబర్ 30న జరిగిన విచారణ సందర్భంగా, ఈ కేసును ధర్మాసనం నవంబర్ 13కి వాయిదా వేసింది. ఖాళీల లెక్కింపు, నూతన పోస్టుల సృష్టి, సీనియారిటీ సమస్యల పరిష్కారంలో పరిపాలనాపరమైన చిక్కులు ఉన్నాయని, కోర్టు ఆదేశాల అమలుకు మరికొంత సమయం కావాలని ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ కోరారు. అయితే, న్యాయస్థానం ఇచ్చిన ప్రధాన ఆదేశాలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఈ కేసులో కొత్తగా ప్రతివాదులుగా చేరిన వారు రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని, ఇప్పటికే కౌంటర్లు వేసిన అధికారులు తదుపరి విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ధర్మాసనం తన గత ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

గాంధీ కుటుంబంలో మరణాలు యాదృచ్ఛికం కాదు

న్యూఢిల్లీ,బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్.. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీపై సంచలన ఆరోపణలత

గురుకుల విద్యార్థులపై వసతి గృహ విద్యార్థుల దాడి



పెద్దవూర,పాఠశాలల్లో, వసతి గృహాల్లో భద్రతా పర్యవేక్షణ లోపించడంతో నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలో విద్యార్థులు అర్ధరాత్రి వేళ పాఠశాల ప్రాంగణం దాటి పట్టణంలోని రోడ్లపైకి చేరుకుని పరస్పరం ఘర్షణకు దిగిన ఘటన కలకలం రేపుతోంది. విద్యార్థులు రోడ్లపై వచ్చి కొట్టుకుంటున్న దృశ్యాల వీడియో బుధవారం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. మండలంలోని గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ముగ్గురు ఈ నెల 4న సాయంత్రం వేళలో తినుబండారాల కోసం పాఠశాల నుండి పెద్దవూరకు చేరుకుని తినుబండారాలు తీసుకుని తిరిగి వస్తుండగా వసతి గృహాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు గురుకుల పాఠశాల ముగ్గురు విద్యార్థులను అడ్డగించి దాడికి దిగినట్టు తెలుస్తుంది. వీడియో చూసిన స్థానికులు, తల్లిదండ్రులు గంజాయి మత్తులో ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపిస్తున్నారు.

గురుకుల విద్యార్థులపై వసతి గృహ విద్యార్థుల దాడి

గురుకుల విద్యార్థులపై వసతి గృహ విద్యార్థుల దాడి

అసలు అర్ధరాత్రి వేళ విద్యార్థులు పాఠశాల నుండి బయటకు ఎలా వచ్చారు? వారు పట్టణంలోని రోడ్లపైకి చేరుకునే వరకు పాఠశాల సిబ్బంది, వసతి గృహాల వార్డెన్లు ఏం చేస్తున్నారు? రాత్రి వేళ విద్యార్థుల కదలికలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్, వార్డెన్లకు లేదా? విద్యార్థుల భద్రత కోసం సెక్యూరిటీ సిబ్బంది కూడా లేకపోవడం వంటి వాటిపై తల్లిదండ్రులు, స్థానికుల నుండి ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల క్రమశిక్షణ, ప్రవర్తనపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సర్వత్రా అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఇలాంటి ఘర్షణలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ నిర్వహించి వారి మానసిక పరిణతిలో స్నేహ సంబంధాలు, ప్రవర్తనపై మార్పు తీసుకురావాలని కోరుతున్నారు. పాఠశాల ప్రిన్సిపల్, వసతి గృహాల వార్డెన్ల పర్యవేక్షణ పూర్తిగా విఫలమైందని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, వసతి గృహాల వార్డెన్లు స్థానికంగా ఉండి ఉంటే ఇలాంటి ఘటన జరిగేది కాదని అంటున్నారు. వసతి గృహాల్లో కనీసం సెక్యూరిటీ గార్డు లేకపోవడం దురదృష్టకరమని తల్లిదండ్రులు వాపోతున్నారు. రాత్రి వేళ భద్రతా ఏర్పాట్లు, విద్యార్థుల బయటకు వెళ్లకుండా అధికారులు కట్టు తెరిచి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేపట్టి ఘటనకు బాధ్యులైన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

టీవీకే ఎమ్మెల్యేల పక్క చూపులు - విజయ్ అలర్ట్ !?



చెన్నై:తమిళనాడులో తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం కొలువుదీరి సరిగ్గా ఆరు నెలలు పూర్తయిన తరుణంలో, ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ అధ్యక్షతన చెన్నై సమీపంలోని పనైయూర్ వేదికగా ఎమ్మెల్యేల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వాన్ని నూతన ప్రమాణాలతో నడిపిస్తామని అధికారంలోకి వచ్చిన టీవీకే.. అతి స్వల్ప కాలంలోనే సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల వివాదాస్పద ప్రవర్తన వల్ల తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను, ప్రతిపక్షాల దాడిని ఎదుర్కొంటోంది. దీనికితోడు 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118 కాగా, టీవీకేకు 109 మంది శాసనసభ్యుల బలమే ఉండటం, కాంగ్రెస్, వీసీకే, వామపక్షాల బాహ్య మద్దతుపైనే సర్కారు ఆధారపడి ఉండటంతో.. ప్రభుత్వ మనుగడ ప్రశ్నార్థకంగా మారకుండా ఉండేందుకు పార్టీ పగ్గాలను కఠినతరం చేసేందుకు విజయ్ సిద్ధమయ్యారు.

వరుస వివాదాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు

ఇటీవల పార్టీ ప్రజాప్రతినిధులపై వెల్లువెత్తిన వరుస ఆరోపణలు ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీశాయి. కళ్లకురిచ్చి మహిళా జిల్లా కలెక్టర్‌కు అసభ్యకర వాట్సాప్ సందేశాలు పంపారన్న అభియోగంపై ఎమ్మెల్యే అరుల్ విఘ్నేశ్ సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలపాలయ్యారు. మరోవైపు తాగునీటి ఎద్దడిపై ప్రశ్నించిన ఒక వృద్ధుడిపై అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తురైయూర్ ఎమ్మెల్యే రవిశంకర్ చేయి చేసుకున్న వీడియో రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. బాధితుడిని పోలీసులతో బెదిరించి బలవంతపు ప్రకటన చేయించారన్న ఆరోపణలు వివాదాన్ని మరింత రాజేశాయి. వీటికి తోడు ఐపీఎల్ మ్యాచ్ చూస్తూ ఒక అనుమానాస్పద పదార్థాన్ని నలిపిన పాత వీడియో కారణంగా మంత్రి శరత్ కుమార్ డ్రగ్స్ ఆరోపణలు ఎదుర్కోవడం, తాంబరం మున్సిపాలిటీ ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలు రావడం, తూత్తుకుడి ఎమ్మెల్యేపై లైంగిక దాడి ప్రోత్సాహం వంటి ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం తీవ్ర ఆత్మరక్షణలో పడింది.

ప్రభుత్వంపై విరుచుకుపడుతున్న ద్రవిడ పార్టీలు

ఈ పరిణామాలపై డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి ప్రధాన ప్రతిపక్షాలు ఉమ్మడిగా విరుచుకుపడుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఐసీయూలో పడ్డాయని, పాలన కోమాలోకి వెళ్లిపోయిందని డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలనా అనుభవం లేకపోవడం, కేడర్‌పై నియంత్రణ లోపించడం వల్లే ఇలాంటి బరితెగింపులు జరుగుతున్నాయని విపక్షాలు విమర్శిస్తుండగా.. టీవీకే మాత్రం విపక్షాలే తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఆపరేషన్ ఆకర్ష్ కుట్రలు పన్నుతున్నాయని ప్రత్యారోపణలు చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావడంతో ప్రతిపక్షాలు సాంకేతికంగా మరోసారి అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించే అవకాశం ఉండటం, త్వరలోనే జరగనున్న 5 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలతో పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ ప్రలోభాలకు గురికాకుండా తమ గూటిని కాపాడుకోవడం విజయ్‌కు అత్యంత క్లిష్టమైన పరీక్షగా మారింది.

మూడు రోజుల పాటు ప్రైవేటు రిసార్టులో ఎమ్మెల్యేలతో భేటీ

సొంత పార్టీ కార్యాలయంలో కాకుండా ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో ఈ అంతర్గత భేటీని నిర్వహించేందుకు సన్నాహాలు చేయడం వెనుక ఎమ్మెల్యేలను కాపాడుకునే ఎత్తుగడ స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, మంత్రుల తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న విజయ్.. క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేది లేదని హెచ్చరించడంతో పాటు అంతర్గత విచారణల ఆధారంగా కొందరి శాఖలను మార్చడం, ఉద్వాసన పలికేలా కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు రానున్న ఐదు ఉప ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసి సంపూర్ణ మెజారిటీకి చేరువకావాలన్న వ్యూహాన్ని కూడా ఈ సమావేశంలో ఖరారు చేయనున్నారు. ఏది ఏమైనప్పటికీ, సినిమాల నుంచి సరికొత్త రాజకీయ ఆశలతో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన విజయ్‌కు.. సొంత ఎమ్మెల్యేల అదుపులేని వైఖరి, సంకీర్ణ సర్కారు సంక్షోభం ఆరు నెలల్లోనే అతిపెద్ద రాజకీయ అగ్నిపరీక్షగా నిలిచాయి.

చిరంజీవిది విలీనం.. విజయసాయి కొత్త 'పీఆర్పీ' లక్ష్యం చేరుతుందా?



విజయవాడ:చిరంజీవి తిరుపతిలో సభ పెడితే ఏకంగా రాష్ట్రం నలుమూలల నుంచి 20 లక్షల మంది అభిమానులు, కార్యకర్తలు వచ్చారు. దేశం దద్దరిల్లేలా సభను నిర్వహించి ప్రజారాజ్యం పార్టీ ఘనంగా లాంచ్ అయ్యింది. అంత జనసందోహంతో ఏ పార్టీ కూడా లాంచ్ అవ్వలేదు.. కానీ కట్ చేస్తే చిరంజీవిని రాజకీయంగా దెబ్బతీసి చాలా మంది నేతల విమర్శలు, సీట్లు అమ్ముకున్నారన్న ఆరోపణలతో ప్రజారాజ్యం పార్టీ ఆ ఎన్నికల్లో ఏకంగా 18 శాతం ఓటు బ్యాంక్, సీట్లు వచ్చినా కూడా కాంగ్రెస్ లో విలీనం కాక తప్పని పరిస్థితి ఎదురైంది.ఇప్పుడు ఏపీ తెరపైకి మరో కొత్త పార్టీ వచ్చింది. అదే వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డి ప్రకటించిన 'పరివర్తన రాజనీతి పార్టీ'.. మరి అంచనాలు లేకుండా వస్తున్న ఈ పార్టీ ఏపీలో ఏ మేరకు ప్రభావితం చూపిస్తుంది. యువత, ఉద్యోగులు, బడుగు బలహీన వర్గాల వారిధిగా చెబుతున్న పార్టీని విజయసాయిరెడ్డి ఏ తీరాలకు చేరుస్తారన్నది హాట్ టాపిక్ గా మారింది.ఏపీలో ఇన్నాళ్లు రెండు ప్రధాన పార్టీలుండేవి. ఒక రెడ్డి సామాజికవర్గానికి అంకితమైన వైసీపీ కాగా.. ఇంకొకటి బలమైన కమ్మ సామాజికవర్గం చేతుల్లోని టీడీపీ.. మధ్యలో కాపుల కోసం ప్రజారాజ్యం ఒకప్పుడు పుట్టి అంతర్ధానమైంది. మళ్లీ జనసేనతో పవన్ కళ్యాణ్ ప్రజల ముందుకు వచ్చి టీడీపీతో పొత్తు పెట్టుకొని సాగుతున్నారు. ఇక మధ్యలో జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ లు పొత్తులతో తమ సంసారాన్ని లాగిస్తున్నాయి.అయితే తెలంగాణలోలాగా ఎక్కువ పార్టీలు ఏపీలో లేవు. అదైతే నిజం.. కానీ ఇప్పుడు ఏపీలోనూ కొత్త పార్టీలు పుట్టుకొస్తున్నాయి. వైసీపీ నుంచి బయటకు వచ్చిన విజయసాయిరెడ్డి ఈ సంచలన అడుగు వేశారు. ఈరోజు తన కొత్త పార్టీని ప్రకటించారు. దాని పేరు ఏంటో తెలుసా? 'పరివర్తన రాజనీతి పార్టీ'.. అంటే షార్ట్ గా 'పీఆర్పీ'.. మన చిరంజీవి పెట్టిన 'ప్రజారాజ్యం'ను పీఆర్పీ అని పిలిచేవారు. ఇప్పుడు ఆ పీఆర్పీ మరో పేరుతో విజయసాయిరెడ్డి ప్రారంభించేశాడు.మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పక్కా 11.11.11 లెక్క కుదిరేలా 11వ నెల 11 గంటల 11 నిమిషాల ముహూర్తం చూసుకొని విజయవాడ ఏ1 కన్వెన్షన్ సెంటర్ వేదికగా కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. దశాబ్దాలుగా ఏపీలో నడుస్తున్న రెండు ప్రధాన పార్టీలు, రెండు కుటుంబాల ఆధిపత్య పోరుకు ముగింపు పలకడమే లక్ష్యంగా మూడో ప్రత్యామ్నాయంగా ఈ కొత్త పయనం ప్రారంభమవుతోంది. రాయలసీమ పౌరుషాన్ని, ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఈ పార్టీని స్థాపించబోతున్నానని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. కుల, మత పిచ్చి రాజకీయాలను పూర్తిగా తిరస్కరిస్తూ అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రధాన ఎజెండా.. యువత, బడుగు బలహీన వర్గాల కోసం ఈ పీఆర్పీ పెడుతున్నట్టు విజయసాయిరెడ్డి ప్రకటించారు..ఏపీలోని దుష్ట పాలకులకు, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా ఈ పార్టీని పెడుతున్నట్టు విజయసాయిరెడ్డి ప్రకటించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ నిర్మాణంలో తాను భాగస్వామినని.. ఆ పార్టీని ఇటుక ఇటుక పేర్చి నిర్మించడంలో తన కృషి ఉందని విజయసాయి ప్రకటించారు. ఆ పార్టీ, నాయకుడు, కార్యకర్తల కోసం నిలబడ్డానని.. కానీ చివరకు తనకు దక్కింది ఏంటి? అని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. జగన్ గారితో అనుబంధం ముగిసిందని.. తాను ఆత్మగౌరవం కోసం బయటకు వచ్చానని తెలిపారు. రాజకీయాల్లో విధేయత ఉండాలని.. కానీ అది బానిసత్వం కాదు అన్నది తన ఉద్దేశం అని తెలిపారు.కరెంట్ కోతలు, తాగు సాగునీటి కష్టాలు లేని నవ ఏపీని నిర్మిస్తామని హామీ ఇస్తున్నారు. ప్రతీ ఎకరానికి రెండు పంటలు పండేలా సాగునీరు అందిస్తామన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతోపాటు చదువుల భారాన్ని తగ్గించి జెన్ జీ యువతకు 100 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటున్నారు. 80 ఏళ్లుగా నెరవేరని ప్రజల కలలను సాకారం చేస్తూ యువతనే రేపటి నాయకులుగా తీర్చిద్దడమే పార్టీ లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు.ఏపీ రాజకీయాల్లో ఇప్పటివరకు రెండు బలమైన వ్యవస్థల మధ్య సాగిన పోరుకు.. విజయసాయిరెడ్డి తీసుకొస్తున్న ఈ 11-11-11 ముహూర్తం ఎలాంటి మలుపు తిప్పబోతోంది? జెన్ జీ తరాన్ని కలుపుకొని ఆయన వేస్తున్న ఈ అడుగులు రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఎంతవరకు మారుస్తాయి అనేది ఇప్పుడు యావత్ ఏపీ తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది.చిరంజీవి రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కోలేక కాడి వదలేశాడు. మరి బలమైన శక్తుల మధ్య విజయసాయిరెడ్డి నిలబడగలరా? రెడ్డి, కమ్మ, కాపులంటూ విడిపోయిన ఏపీ సమాజంలో యువతను, జెన్ జీలను, బడుగు బలహీనవర్గాలు, జనాకర్షక పార్టీ మేనిఫెస్టోతో ముందుకొస్తున్న విజయసాయిరెడ్డి రాజకీయ ప్రయాణం ఏ తీరాలకు చేరుతుందన్నది వేచిచూడాలి.

అక్రమ అండాల సేకరణ కేసులో కీలక పరిణామం..



హైదరాబాద్,హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన అక్రమ మానవ అండాల సేకరణ కేసులో బేగంపేట్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. కేసు విచారణలో భాగంగా ఎనిమిది మంది నిందితులను కోర్టు అనుమతితో బుధవారం జైలు నుంచి పోలీసుల కస్టడీలోకి తీసుకున్నారు. గురువారం నుంచి ఐదు రోజుల పాటు వారిని విచారించనున్నారు. మరోవైపు, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టయిన మరో నిందితుడు దుర్గాప్రసాద్‌ను కూడా పీటీ వారెంట్‌పై బేగంపేట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అక్టోబర్ 31న వెలుగులోకి వచ్చిన ఈ అక్రమ వ్యవహారంలో బేగంపేట్, సరూర్‌నగర్, ఎల్బీనగర్ పోలీసులు మూడు వేర్వేరు కేసులు నమోదు చేశారు. బేగంపేట్ పోలీసులు జరిపిన ప్రాథమిక దర్యాప్తులో మధ్యప్రదేశ్‌కు చెందిన అమిత్ శర్మ కీలకంగా వ్యవహరించినట్లు గుర్తించారు. నగరంలోని ఐవీఎఫ్, ఏఆర్‌టీ కేంద్రాలకు అండాలను సరఫరా చేసేందుకు పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన పేద యువతులు, మహిళలకు డబ్బు ఆశ చూపి హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లు తేలింది. అనంతరం వారిని ఓ మహిళా హాస్టల్‌లో ఉంచి అండాలను సేకరించినట్లు పోలీసులు గుర్తించారు.ఈ వ్యవహారంలో అమిత్ శర్మ, నిఖిత్ పర్వీన్, రేష్మా ఖాతూన్, మేఘావత్ శ్రీనివాస్, ఎస్.కే. పర్వీన్, విజయ్ భాగ్యరావు, పంకజ్ సోనిలను పోలీసులు అరెస్టు చేశారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అమిత్ శర్మ ముఠాతో సంబంధాలున్న దుర్గాప్రసాద్‌ను కూడా అరెస్టు చేశారు. సైదాబాద్‌కు చెందిన ప్రవీణ్ ద్వారా నకిలీ ఆధార్ కార్డులు తయారు చేయించి, యువతులు, మహిళల నుంచి పలుమార్లు అండాలను సేకరించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. వైద్యశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఈ కార్యకలాపాలు సాగించినట్లు పోలీసులు గుర్తించారు.

రూ.2 కోట్ల లావాదేవీలపై ఆరా.. 16 కేంద్రాలకు నోటీసులు

అమిత్ శర్మ ముఠాతో నగరంలోని ఓ ఐవీఎఫ్, ఏఆర్‌టీ కేంద్రానికి సంబంధించి సుమారు రూ.2 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నగరంలోని సుమారు 16 ఐవీఎఫ్, ఏఆర్‌టీ కేంద్రాల నిర్వాహకులకు బేగంపేట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం కస్టడీలో ఉన్న నిందితులను పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. ఈ విచారణలో మరిన్ని కీలక ఆధారాలు, అక్రమ వ్యవహారంలో భాగస్వాములైన ఇతర వ్యక్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన నిందితుల సంఖ్య 10కి చేరింది. అయితే, కస్టడీ విచారణ, దర్యాప్తులో వెల్లడైన అంశాలపై మల్కాజిగిరి పోలీసులు అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

కాంగ్రెస్‌కు పరీక్షగా ఉద్యోగుల అసంతృప్తి!



హైదరాబాద్, తెలంగాణలో రెండో వేతన సవరణ సంఘంనివేదిక అమలు ఆలస్యం అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా మరో సవాల్‌గా మారుతోంది. ఇప్పటికే పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు.. ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పడే అవకాశాలున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. తెలంగాణలో రెండో పీఆర్సీ ప్రక్రియ ప్రారంభమై మూడేళ్లు దాటుతున్నా.. ఇప్పటివరకు నివేదికపై స్పష్టత రాకపోవడం ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమవుతోంది. 2023 అక్టోబర్‌లో రెండో పీఆర్సీని ఏర్పాటు చేయగా.. ఆరు నెలల్లో సిఫార్సులు అందించాల్సి ఉంది. అయితే గడువు దాటినా నివేదిక పెండింగ్‌లోనే ఉండటంతో ఉద్యోగ సంఘాలు పలుమార్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి.ఈ ఏడాది మే 2న ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. పీఆర్సీ నివేదికను త్వరగా అందించాలని అధికారుల కమిటీని ఆదేశించినట్లు ప్రకటించారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 18లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వం గడువు విధించగా.. నవంబర్ నాటికీ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ పరిష్కారం కాలేదనే అసంతృప్తి కొనసాగుతోంది.పీఆర్సీ నివేదికను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (డిమాండ్ చేస్తోంది. 51 శాతం ఫిట్‌మెంట్‌తో 2023 జులై 1 నుంచి కొత్త వేతనాలను అమలు చేయాలని కోరుతోంది.దీంతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రస్తుతం నెలకు కేటాయిస్తున్న రూ.1,000 కోట్లను రూ.2,000 కోట్లకు పెంచాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల విలువ రూ.10 వేల కోట్లకు పైగా ఉందని జేఏసీ నేతలు చెబుతున్నారు.నవంబర్ 6న హైదరాబాద్‌లోని టీజీవో భవన్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. దీపావళి తర్వాత ఆందోళన కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ ఉద్యోగుల అసంతృప్తి కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా కీలకంగా మారుతోంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఓటర్లుగా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో నాలుగు లక్షలకు పైగా ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గ్రాడ్యుయేట్లుగా ఉన్నారని జేఏసీ నేతలు పేర్కొంటున్నారు. వీరిలో గణనీయమైన సంఖ్యలో ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారని చెబుతున్నారు.పీఆర్సీ అమలు సహా తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేయడమే కాకుండా.. వ్యక్తిగత స్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని కొందరు ఉద్యోగులు హెచ్చరిస్తున్నట్లు సమాచారంఅధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే పీఆర్సీ, పెండింగ్ డీఏలు, బిల్లుల చెల్లింపులు, పెన్షన్ విధానం వంటి అంశాలు ఇంకా చర్చల్లోనే ఉండటంతో ఉద్యోగ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, పీఆర్సీ నివేదిక అందిన తర్వాత తీసుకోవాల్సిన నిర్ణయాలు ప్రభుత్వానికి కీలకంగా మారాయి. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపుతుందా? లేక ఉద్యోగుల ఆందోళన మరింత తీవ్రమవుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది.

సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఊపు.. పెండింగ్ పనులపై తుమ్మల ఫోకస్!



హైదరాబాద్,ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగునీటి వసతుల మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టే దిశగా అడుగులు వేస్తోంది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల సమస్యలు, అసంపూర్తి నిర్మాణాలు, కొత్తగా చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమైన ఆయన.. రెండు జిల్లాలకు సంబంధించిన 15 కీలక అంశాలను వివరించారు.సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిర్మాణ పనుల పురోగతి, నిధుల కేటాయింపులు, వరద నివారణ చర్యలు, చెరువుల అభివృద్ధి వంటి అంశాలపై ఇరువురు మంత్రులు చర్చించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటంతోపాటు ఖమ్మం నగరానికి తాగునీటి వసతి మెరుగుపరచడం, మున్నేరు వరదల నుంచి ప్రజలకు రక్షణ కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తుమ్మల కోరారు.

సీతమ్మసాగర్ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కీలకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణం ప్రస్తుతం ఎన్‌జీటీ కేసు కారణంగా నిలిచిపోయింది. ఈ పనులను తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన పర్యావరణ అనుమతులపై మంత్రి తుమ్మల చర్చించారు.ఈ నెల 9న ఎఫీటీఆర్ఐ, హైదరాబాద్ ద్వారా పారివేశ్ పోర్టల్‌లో పర్యావరణ అనుమతులకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించినట్లు వివరించారు. ఈఏసీ కన్వీనర్ వై.పి.సింగ్‌తో సంప్రదింపులు జరిపి అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. అవసరమైన క్లియరెన్సులు లభిస్తే ప్రాజెక్టు పనులు మళ్లీ ప్రారంభించే అవకాశం ఉంటుంది.

సీతారామ పనులు త్వరగా పూర్తి చేయాలి

సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన జూలూరుపాడు టన్నెల్ నిర్మాణంపై కూడా తుమ్మల ప్రస్తావించారు. హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా సంస్థ చేపడుతున్న పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ ప్రాజెక్టులోని ప్యాకేజీ-11 పరిధిలో పంప్‌హౌస్-4 నిర్మాణం కొనసాగుతోందని, దాన్ని కూడా నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని వివరించారు.అశ్వారావుపేట ప్రాంతంలోని దబ్బతోగు, ఆసుపాక గ్రామాలకు చెందిన చిన్న నీటిపారుదల చెరువులకు నీటిని అందించేందుకు వెంకమ్మ చెరువు వరద ప్రవాహ కాలువ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఈ పనులకు రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ ఇప్పటికే మే 11న ఆమోదం తెలిపింది. అయితే సెప్టెంబర్ 10న ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదన ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ ఫైలును త్వరగా క్లియర్ చేసి నిర్మాణ పనులకు మార్గం సుగమం చేయాలని మంత్రి కోరారు.

పెద్దవాగుకు శాశ్వత పరిష్కారం

పెద్దవాగు మధ్యతరహా ప్రాజెక్టు వద్ద దెబ్బతిన్న కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిన అవసరాన్ని తుమ్మల వివరించారు. ఇందుకు సంబంధించిన అంచనాలను 2025 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఈ పనుల కోసం తెలంగాణ వాటాగా రూ.3.40 కోట్లు చెల్లించేందుకు అంగీకారం తెలపాలని ఏపీ ప్రభుత్వం కోరింది. దీనికి సంబంధించిన ఫైలు ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఈ వ్యవహారాన్ని త్వరగా పరిష్కరించి ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.సీతారామ ఎత్తిపోతల పథకంలోని డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ పరిధిలో మరో మార్పు తీసుకురావాలని ప్రతిపాదించారు. ప్యాకేజీలు 1, 2, 7, 8లో సంప్రదాయ గ్రావిటీ కాలువలకు బదులుగా ప్రెషరైజ్డ్ పైప్డ్ ఇరిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనివల్ల పైపుల